ప్రజాశక్తి
శనివారం 6 ఏప్రిల్ 2024
5
విజయనగరం

నేడు రాజా కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రాజా కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్ వీరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2021, 2022, 2023, 2024లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలలో పాల్గొనవచ్చునని చెప్పారు. గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్ ఎంపిసి, బైపిసి పూర్తి చేసి 18 నుంచి 20 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

కురుపాం, అరకు స్థానాల్లో సిపిఎం పోటీ

- కురుపాం అభ్యర్థిగా మండంగి రమణ, అరకు పార్లమెంటు అభ్యర్థిగా అప్పలనర్స
- బిజెపి తొత్తు, పొత్తు పార్టీలను ఓడించండి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం
- 22న రమణ నామినేషన్

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

అరకు పార్లమెంట్, కురుపాం అసెంబ్లీ స్థానాల్లో సిపిఎం అభ్యర్థులు పోటీ చేస్తారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం ప్రకటించారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మతో కలిసి ఆయన శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అరకు పార్లమెంట్ స్థానం నుంచి పి.అప్పలనర్స, కురుపాం అసెంబ్లీ స్థానం నుంచి మండంగి రమణను అభ్యర్థులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. కురుపాం అభ్యర్థి రమణ ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేస్తారని ప్రకటించారు. బిజెపి రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిందన్నారు. రాజధాని నిధులు మళ్లింపు, ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇవ్వలేదని తెలిపారు. గిరిజన యూనివర్సిటీ నిర్మాణం చేయకుండా గిరిజన విద్యార్థులతో చెలగాటమాడుతోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కార్మికులు పోరాటం చేస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదని గుర్తు చేశారు. స్టీల్ ప్లాంట్‌కు ముడి సరుకులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతూ వాటి ఆస్తులను ప్రయివేటుపరం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం చేసిన బిజెపితో టిడిపి, జనసేన కూటమి కట్టడం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేయడమేనని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ ఐదేళ్లలో రాష్ట్ర ప్రయోజనాల కన్నా బిజెపి ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చిందని విమర్శించారు. కార్మిక చట్టాల్లో మార్పు, ప్రభుత్వ పరిశ్రమల ప్రయివేటీరణకు పూర్తి సహాయ సహకారాలు అందించిందని తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపిని, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేనను, తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. సిపిఎం తరపున పోటీ చేయనున్న అప్పలనర్స, మండంగి రమణ గిరిజన సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు. గిరిజన, మధ్య తరగతి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కష్ణమూర్తి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం విద్య రంగాన్ని కాషాయికరణ చేయడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రాల హక్కులను హరించి కార్పొరేట్లకు బిజెపి తాకట్టు పెడుతోందన్నారు. విద్యుత్ రాష్ట్రం హక్కు కాగా, దాన్ని కేంద్రం స్వాధీనం చేసుకొని ఉచిత విద్యుత్తు, సబ్సిడీలు లేకుండా చేస్తుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేస్తామని బిజెపి బహిరంగంగానే ప్రకటించిందని అన్నారు. మరోసారి బిజెపి అధికారం చేపడితే బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీల రిజర్వేషన్లు పోతాయని, భూ హక్కు చట్టం కూడా రద్దు అవుతుందని అన్నారు. కాబట్టి బిజెపిని, దానితో కలిసి ఎన్నికల్లో పోటీ చేసే టిడిపి, జనసేనలను, పరోక్షంగా సహకరించే వైసిపిని ఓడించాలని కోరారు. కురుపాం అసెంబ్లీ స్థానంలో రమణను, ఎంపి పార్లమెంట్ అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశం లో పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డివేణు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.అవినాష్, వై.మన్మధరావు, కొల్లి గంగునాయుడు పాల్గొన్నారు.

మండంగి రమణ బయోడేటా

పేరు : మండంగి రమణ
వయస్సు : 51
చదువు : 10వ తరగతి
తల్లిదండ్రులు : మండంగి దుబల (లేటు), మండంగి సత్తారి
భార్య : మండంగి నరసమ్మ
పిల్లలు : ఇద్దరు కుమారులు. వెంకట కిశోర్, తేజ
స్వస్థలం : సవరకోటపాడు, గుమ్మలక్ష్మీపురం మండలం
సామాజిక తరగతి : గిరిజన సవర
కుటుంబ నేపథ్యం : వ్యవసాయ కూలీ కుటుంబం
పార్టీలో ప్రస్థావన : 1990లో గిరిజన సంఘంతో పరిచయం. 1994లో సిపిఎంలో చేరిక. పలు పోరాటాల్లో అరెస్టులు, విడుదల
ప్రస్తుత హోదాలు : చెముడుగూడ ఎంపిటిసి సభ్యుడు. పార్టీ మండల కమిటీ సభ్యులు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి
ప్రజాప్రతినిధి అనుభవం : రెండుసార్లు సర్పంచ్‌గా, 2సార్లు ఎంపిటిసి సభ్యుడిగా ఎన్నిక
గతంలో నిర్వహించిన బాధ్యతలు : గిరిజన సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, గౌరవాధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు
ప్రధాన ఆందోళనలు, పోరాటాలు : స్థానికంగా సాగునీటి చెక్‌డామ్‌ల సాధనకు పోరాటం, గిరిజన ఉత్పత్తుల గిట్టుబాటు ధరల కోసం పోరాటం, అటవీ పోడు పట్టాల కోసం ఉద్యమం, జీవో 3 పునరుద్దరణ పోరాటం, 1/70 అమలు పోరాటం, ఉద్యమాల్లో పాల్గొనడం. నాయకత్వం వహించడం.

నాలుగు రోజులుగా

గప్ చుప్

- కళాకు నాగార్జున సహకరించేనా?
- నియోజకవర్గ ఆత్మీయ సమావేశానికీ డుమ్మా
- చీపురుపల్లి టిడిపిలో ఆగని గ్రూపుల పోరు

కిమిడి నాగార్జున

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

చీపురుపల్లి నియోజకవర్గ అసెంబ్లీ టిడిపి అభ్యర్థి కిమిడి కళావెంకటరావుకు ఇదే నియోజకవర్గం నుంచి టిక్కెట్ ఆశించి భంగపడ్డ కిమిడి నాగార్జున సహకరిస్తారా? పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి నాలుగు రోజులు కావస్తున్నా నాగార్జున తన వైఖరి ఎందుకు ప్రకటించలేదు. ఇదీ తెలుగు తమ్ముళ్లతోపాటు రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గంలో సాగుతున్న చర్చ. నాగార్జున తమతో కలిసి వస్తారంటూ కళా ముఖ్యఅనుచరులు చెప్తున్నారు. కానీ, అటువంటిదేమీ లేదని నాగార్జున అనుచరులు కొట్టిపారేస్తున్నారు. ఇందుకు తగ్గట్టే నియోజకవర్గ కార్యకర్తలతో శుక్రవారం కళా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో నాగార్జున పాల్గొనలేదు. 'నీ రాజకీయ భవిష్యత్తు నేను చూసుకుంటాను' అంటూ లోకేష్ భరోసా ఇచ్చినప్పటికీ నాగార్జున అసంతృప్తి వీడలేదట.

అందుకే నాలుగు రోజులుగా బయటకు రావడం లేదనే చర్చ నడుస్తోంది. సీటు కేటాయింపులో జాప్యం జరగడం, చివరకు స్వయాన పెదనాన్నకు కేటాయించడం పట్ల నాగార్జున ఇంకా జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే 'యువత రాజకీయాల్లోకి రావద్దు, నిజాయితీగా పనిచేసినవారికి న్యాయం జరిగే పరిస్థితి లేదు' అంటూ సందేశం ఇచ్చేశారు. 'కళా వద్దు -నాగార్జునకే టిక్కెట్ ఇవ్వాలి' ర్యాలీ నిర్వహించి మరీ చీపురుపల్లి నడిరోడ్డుపై నినాదాలు చేశారు. వారితోపాటు నాగార్జున అనతి కాలంలో తిరిగి కళాను బలపర్చడం అంటే ప్రజల్ని మభ్యపెట్టడమే అవుతుంది. సమాధానం చెప్పుకోలేని పరిస్థితి కూడా ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో నాగార్జున తిరిగి కళాతో కలిసి పనిచేయలేకపోవచ్చని, ఒకవేళ అలా పనిచేస్తే జనంలో నాగార్జున గ్రూపు తగ్గిపోయే ప్రమాదం ఉంటుందని పలువురు రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు శుక్రవారం రాత్రి కళా నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి నాగార్జునతో పాటు ముఖ్య అనుచరుల్లో కొందరు వెళ్లలేదు. దీంతో, టిడిపిలో ఇంకా గ్రూపుల పోరు కొనసాగుతుందని వేరేగా చెప్పనక్కర్లేదు. ఇదే అదునుగా వైసిపి అభ్యర్థి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చాపకింద నీరులా టిడిపిలోని అసంతృప్తులు, తటస్తులను లాగేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ ప్రచార సభలు నిర్వహించారు. టిడిపి ఆలస్యంగా ముందుకు కదులుతోంది. కానీ, ఈ నియోజకవర్గం టిడిపికి కంచుకోట వంటిది. టిడిపి ఆవిర్భావం తరువాత ముచ్చటగా మూడుసార్లు మాత్రమే మంత్రి బొత్స గెలిచారు. మిగిలిన అన్ని ఎన్నికల్లోనూ టిడిపిదే పైచేయిగా నడిచింది. ప్రస్తుత ఎన్నికల్లో ఎలాంటి పరిస్థితులు ఎదురౌతాయో వేచి చూడాల్సిందే.

నాగార్జున లేకుండా స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న కళావెంకటరావు(ఫైల్)

జరజాపుపేటలో ఆందోళన చేస్తున్న మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు

65వ రోజుకు మిమ్స్ ఉద్యోగుల పోరాటం

హెచ్ఆర్ ఇంటి ముందు ఆందోళన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తమ సమస్యల పరిష్కారం కోసం మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు స్థానిక ఆర్ఒబి వద్ద చేపట్టిన నిరశన పోరాటం శుక్రవారం 65వ రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో మిమ్స్ యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తూ కార్మికులకు, ఉద్యోగులకు ద్రోహం చేస్తున్న జరజాపుపేటకు చెందిన హెచ్ఆర్ ఎ.శ్రీనివాసరావు, కాళ్ళ శ్రీనివాసరావు ఇళ్లను ముట్టడించారు. తప్పుడు ఒప్పందం చేసి కార్మికుల కడుపులు కొడతారా? అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు అగ్రిమెంట్ కాపీలు ఇచ్చేవరకు కదిలేది లేదని మండుటెండలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ 2 నెలలు గడుస్తున్నా మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించక పోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో మిమ్స్ కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణ రావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కె.రామారావు, మధు, కామునాయుడు, బంగారు నాయుడు, నాగభూషణం, అప్పలనాయుడు, రామకృష్ణ, గౌరి, కుమారి, మూర్తి, శ్రీను, రాజబాబు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ స్టేషన్‌లో ఉన్న సిఐటియు నాయకులు, మిమ్స్ ఉద్యోగులు

మిమ్స్ పోరాటంలో ఏడుగురు నాయకులు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సమస్యలు పరిష్కరించాలని సుదీర్ఘకాలంగా ఆందోళన చేస్తున్న మిమ్స్ పోరాటంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. 62రోజులుగా సమ్మె చేస్తున్నా యాజమాన్యం గాని, అధికారులు గాని స్పందించకపోవడంతో కడుపు మండిన ఉద్యోగులు మిమ్స్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్సు యూనియన్ ఆధ్వర్యాన ఈనెల 2న విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రహదారిపై బైఠాయించారు. తాజాగా శుక్రవారం మిమ్స్ హెచ్ఆర్ ఇంటి ముందు ఆందోళన చేపట్టారు. ఈనేపథ్యంలో సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్‌తో పాటు మిమ్స్ ఉద్యోగులు ఎం.నారాయణరావు, కె.మధు, ఎం.రాంబాబు, పి.గౌరి, పి.ఈశ్వరమ్మను నెల్లిమర్ల పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఐదుగురిని పూసపాటిరేగ స్టేషన్‌కు తరలించగా, ముగ్గురిని విజయనగరం టూ టౌన్ స్టేషన్‌లో ఉంచారు.

గేదెల సత్తిబాబుకు డాక్టరేట్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని పోతనాపల్లి గ్రామానికి చెందిన గేదెల సత్తిబాబుకు ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రసాద్‌రెడ్డి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆంధ్ర యూనివర్సిటీ సోషల్ వర్క్ విభాగంలో అంగవైకల్యం కలిగిన వారికి వృత్తివిద్యా శిక్షణ అనే అంశంపై ప్రొఫెసర్ టి.శోభశ్రీ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఆయనకు డాక్టరేట్ లభించింది. కార్యక్రమంలో ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్, వివేకానంద కళాశాల కరస్పాండెంట్ సిహెచ్ఆర్‌కె ప్రసాద్ పాల్గొన్నారు. సత్తిబాబు ప్రస్తుతం విశాఖపట్నంలో ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో సైక్రియాట్రి డిపార్ట్మెంట్లో పనిచేస్తున్నారు.

ఎయు విసి నుంచి డాక్టరేట్ అందుకుంటున్న సత్తిబాబు

మద్యం తరలిస్తూ పట్టుబడిన వైన్‌షాప్ సేల్స్‌మేన్

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని ఉంగరాడమెట్ట వద్దనున్న ప్రభుత్వ వైన్‌షాపులో పనిచేస్తున్న సేల్స్‌మేన్ జి.రమేష్.. 60 మద్యం బాటిళ్లను శుక్రవారం అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో ఆయనపై ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేడు వేపాడ మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నిశ్చితా ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అధికారులంతా సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

అదితి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతిరాజు శుక్రవారం రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 29వ డివిజన్ టౌన్ సెంటర్ లే అవుట్, శర్వాని నగర్, షిరిడి సాయినగర్, కృష్ణరాజపురం, శ్రీనివాసనగర్, మహాలక్ష్మినగర్, శ్రీరాంనగర్ కోలనీ తదితర ప్రాంతాల్లో తిరిగి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్న, శాంతిభద్రతలు బాగుండాలన్న టిడిపి అధికారంలోకి రావాలన్నారు. నేడు రింగ్ రోడ్డు చుట్టుపక్కల ప్రాంతాలు ఇంతలా అభివృద్ధి చెందాయంటే నాడు అశోక్ ముందు చూపే దీనికి నిదర్శనమని అన్నారు. నగరాన్ని విస్తరింప చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పించి వారి ఆర్థిక, సామాజికాభివృద్ధికి తోడ్పడటమే తమ కర్తవ్యమని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పి టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు కార్యదర్శి గంటా పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు రాష్ట్ర బీసీ నాయకులు వేచలపు శ్రీనివాసరావు, అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, గాడు అప్పారావు పాల్గొన్నారు.

మహిళా మేలుకో..

మహిళా మేలుకో పేరిట తెలుగు మహిళా ఆధ్వర్యాన నగరంలో శనివారం 20, 40, 41, 47 డివిజన్లలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. టిడిపి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజును గెలిపించాలని మహిళలను కోరారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ టిడిపిని స్థాపించిన తరువాతే మహిళలకు గుర్తింపు వచ్చిందన్నారు, మహిళలకు ఆస్తిలో సమానహక్కు కల్పించారని, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. ప్రస్తుత వైకాపా ప్రభుత్వంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు వంటివి విపరీతంగా పెరిగాయని, మహిళలకు రక్షణ కల్పించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని విమర్శించారు. అందుచేత మహిళలకు రక్షణ కల్పించి వారిని అన్ని రంగాలలో ముందుకు నడిపించే టిడిపి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా నాయకులు సువ్వారి అనురాధ బేగం, పత్తిగిల్లి సూర్యకుమారి, కంది శమంతకమణి, సుంకరి సునీత, సియ్యదూల ఝాన్సీ, మరిపిన పద్మలత, చింతల వీరలక్ష్మి, అచ్చియమ్మ, పైడిరాజు పాల్గొన్నారు.

తోటపాలెంలో జయహో బిసి

తోటపాలెంలో జయహో బిసి కార్యక్రమం జరిగింది. సమావేశంలో వైసిపి ప్రభుత్వంలో బిసిలకు జరుగుతున్న అన్యాయాలు, వారిపై దాడులు వంటి విషయాలపై చర్చించారు. టిడిపికి మద్దతుగా బిసిలందరూ నిలవాలని కోరారు. కార్యక్రమంలో కంది మురళీనాయుడు, కోండ్రు శ్రీనివాసరావు, మాడిమి దేవేంద్రనాథ్, మనోహర్, కందువా ప్రకాష్, పేరిశెట్టి గోపి, కరణం సూర్యతేజ, చినబాబు, బోను కుమార్, గండ్రేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అదితి గజపతిరాజును ఆత్మీయంగా పలుకరిస్తున్న మహిళ

తాగునీరూ కొనుక్కోవాల్సిందే

రోడ్లు లేవు.. కాలువలు లేవు • కనీస సౌకర్యాలకు నోచని అయ్యప్పనగర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సుమారుగా రెండు వేలకు పైగా కుటుంబాలు నివాసం.. ఎక్కువగా రియల్టర్లు, బిల్డర్లు వద్ద కొనుకున్న గ్రూప్ హౌస్‌లు, అపార్టుమెంట్లు. అది కూడా అధికార,ప్రతిపక్ష పార్టీలకు చెందిన అనుయాయ వద్ద. అయినా ఆ కాలనీకి రోడ్లు, కాలువలు లేవు. విజయనగరం నుంచి నెల్లిమర్లవైపు వెళ్లే రూట్‌లో ఉన్న అయ్యప్పనగర్‌లో దుస్థితి ఇది.

అయ్యప్ప నగర్ కాలనీ ఏర్పడి 20 ఏళ్లయినా నేటికీ మౌలిక సదుపాయాలు లేవు. రోడ్లు,కాలువలు వేస్తామని ఎన్నికల సమయంలో చెబుతున్న టిడిపి,వైసిపి నాయకులు ఆ తరువాత ఆ కాలనీవైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. సమస్యలు పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తుంది. ఇద్దరు ప్రాణాలు కోల్పోయి.. పెద్దఎత్తున పోరాడితే తప్ప రహదారిపై స్పీడ్ బ్రేకర్లువేయని పాలకులు కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. డబ్బులిచ్చి కొనుక్కుంటే తప్ప వారికి తాగునీరు లేని పరిస్థితి ఉంది. వాటర్ ట్యాంక్ కట్టిస్తామని చెప్పిన ప్రస్తుత పాలకులు ఆ హామీని మరచిపోయారు. 2006 సంవత్సరంలో వేసిన రోడ్లు తప్ప నేటికీ కొత్త రోడ్లు లేవు.దీంతో కాలనీలో రోడ్లు రాళ్లు తేలి ప్రమాదాలకు నిలయంగా మారాయి. రోడ్డు బాగోలేని కారణంగా మోడల్‌స్కూలుకు వెళ్లే విద్యార్థులు సైకిళ్లపై నుంచి పడిపోయి గాయపడుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి.

రోడ్డు మీదే మురికి నీరు

కాలనీలో కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. కొన్ని అపార్ట్మెంట్లు వారు ఇంకుడు గుంతలు తీసుకొని మురికినీరు గుంతల్లోకి వెళ్లేలా చేస్తున్నారు. మరోవైపు కాలనీలోని పార్కు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మందుబాబులతో పాటు, అనేకమైన అసాంఘిక కార్యకలాపాలకు నివాసంగా మారింది.

చాలీచాలని వీధి లైట్లు..తరచూ దొంగతనాలు

వేలాది కుటుంబాలు ఉన్నప్పటికీ అక్కడి వారంతా మధ్య తరగతి కుటుంబాలు. ఉదయం పది గంటల తర్వాత ఉద్యోగాలు, వివిధ పనులకు వెళ్లిపోతుంటే ఇదే అదునుగా చూసుకొని పట్టపగలు దొంగతనాలు జరుగుతున్నాయి. రాత్రి వేళ తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా దొంగలు చోరీకి పాల్పడుతున్నారు.

మట్టిరోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న మురుగునీరు

తాగునీరు సరఫరా చేయాలి

అయ్యప్ప నగర్‌లో ప్రధానంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ప్రతికుటుంబం కేన్లతో తాగునీటిని కొనుక్కోవాల్సి వస్తోంది. పాలకులు తాగునీరు అందించి మా దాహాన్ని తీర్చాలి.

- నూకల సుధీర్, అయ్యప్ప నగర్ కాలనీ కార్యదర్శి

మురికి కూపం నుంచి కాపాడండి



అయ్యప్ప నగర్‌కాలనీ ఏర్పడి 20ఏళ్లయినా నేటికీ కనీస సౌకర్యాలైన రోడ్లు, కాలువలు, వీధి లైట్లు వంటివి లేవు. ఎన్నికల సమయంలో రావడం, తరువాత కాలనీ పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కాలనీ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలి.

- యుఎస్ రవికుమార్, అయ్యప్ప నగర్ కాలనీ వాసి

మీరంతా సహకరిస్తే
స్వతంత్ర అభ్యర్థిగా పోటీ

కర్రోతు సత్యనారాయణ

ప్రజాశక్తి- భోగాపురం

మీరంతా సహకరిస్తే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ అన్నారు. పోలిపల్లి గ్రామంలోని ఆయన ఇంటి వద్ద శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో సేవలందించి యువగళం, శంఖారావం వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించిన బంగార్రాజుకు టికెట్ ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. అందుకు మీరంతా సహకరిస్తే తానే పోటీ చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు దాసరి అప్పలస్వామి, నీలాపు అప్పలరామిరెడ్డి, ముంజేరు మాజీ సర్పంచ్ రామకష్ణ, ఎంపిటిసి పిడుగు వెంకట సత్యం, రీసు రమణ, సూర్య తేజ మాస్టర్, హరిబాబు, కోల రామసూరి తదితరులు మాట్లాడారు. తామంతా మీ వెంట నడుస్తామని చెప్పారు. సమావేశంలో మండలంలోని పలు పంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు నుంచి ముగ్గురికి పిలుపు

ప్రజాశక్తి-బొండపల్లి

టిడిపి జాతీయ పార్టీ అధ్యక్షులు నారాచంద్రబాబు నాయుడు నుంచి విజయవాడ రావాలని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ, విజయనగరం మాజీ ఎమ్మెల్యేమీసాల గీతకు పిలుపు వచ్చింది. ఈమేరకు శనివారం ఉదయం వీరిద్దరూ గుంటూరు వెళ్లనున్నారు. టిడిపి ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో ఐదారు చోట్ల మారుతాయని తాజా వార్తలు వస్తున్న నేపథ్యంలో చంద్రబాబు పిలుపునకు ప్రాధాన్యత సంతరించుకుంది.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని పంచముఖ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తిరుమల మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని ధార్మికవేత్త పెంటపాటి ముత్యాలరావు, పంచముఖ హనుమాన్ దేవాలయం కమిటీ ప్రతినిధి పెంటపాటి కామరాజు తెలిపారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ఈ మెగా వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరం లో న్యూరో స్పెషలిస్ట్, కార్డియాలజీ, పంటి సమస్యలకు సంబంధించిన ప్రత్యేక వైద్యులు, సాధారణ వైద్య నిపుణులు హాజరై ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో గురుస్వామి కందాళ సాయి బాబా, కె.నారాయణరావు, తిరుమల ఆసుపత్రి ఉద్యోగులు సత్తిబాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆయన జయంతి సందర్భంగా జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆద్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం జయంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఇతర అధికారులు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంక్షేమ వసతి గృహ విద్యార్థులు మాట్లాడుతూ, జగ్జీవన్ జాతికి చేసిన సేవలను శ్లాఘించి, జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, సాంఘిక సంక్షేమశాఖ డిడి రామానందం, సంక్షేమాధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. సామాజిక సమానత్వం కోసం బాబూ జగజ్జీవన్‌రాం అందించిన సేవలు అజరామరమని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. మల్లయ్య నాయుడు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో.. స్థానిక జెఎన్‌టియులో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించింరు. విసి ప్రొఫెసర్ కె. వెంకట సుబ్బయ్య బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి చేసిన సేవలను వివరించారు. క్యాక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, కె.బాబులు, కె.శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్. గురునాథ, తదితరులు పాల్గొన్నారు.

సత్య డిగ్రీ, పిజి కళాశాలలో.. జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి మాట్లాడుతూ జగ్జీవన్‌రాం ఎంతో అంకితభావంతో దేశానికి ఎంతో సేవనందించారని, ఒక వైపు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే మరో వైపు సామాజిక సమానత్వం కోసం పాటుపడ్డారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ సి సి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్య వేణి, ఎం.ఉదయ్ కిరణ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.సూరపు నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత బహుజన శ్రామిక యూనియన్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రారామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు మాట్లాడుతూ దేశ ఉప ప్రధానిగా రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా తన జీవితాన్ని ప్రజా సంక్షేమానికి అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాయి ఈశ్వరరావు, జి. సుందర్రావు, నక్కిడాపు పైడిరాజు, కోరుకొండ వరలక్ష్మి, ఎస్.పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెసి కార్తీక్

విజయనగరం కోట : బాబూ జగ్జీవన్‌రాం గొప్ప రాజనీతిజ్ఞుడని గాజులరేగ నారాయణ పబ్లిక్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. శుక్రవారం ఆ పాఠశాలలో జగ్జీవన్‌రాం జయంతిని నిర్వహించారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మహా నాయకుల జీవిత చరిత్రల పుస్తకాలను బహుమతిగా ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యాన.. అర్అండ్‌బి జంక్షన్‌లో జగజ్జీవన్‌రామ్ ఆధ్వర్యాన ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పెంకి ఇజ్రాయెల్, అరసాడ రవికుమార్, యందవ పైడితల్లి, బోగి శ్రీను, మందపల్లి నిర్మల్ కుమార్,యజ్జల సంజీవరావు, బాత దిలీప్ కుమార్, పొట్నూరు శ్రీనివాసరావు, దేవాబత్తుల ప్రభాకర్, పెంకిప్రసాద్, అరసాడ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్ : మండలంలోని కొత్తూరు గిరిజన గ్రామంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం జయంతి నిర్వహించారు. జగ్జీవన్‌రాం చిత్రపటానికి యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, నాయకులు ప్రసన్నకుమార్, కృష్ణదాసు, శంకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రాం చేసిన కృషిని గిరిజనులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గిరిజనులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని వల్లంపూడి, బల్లంకి, ఎన్‌కెఆర్‌పురం గ్రామాల్లో జగ్జీవన్‌రాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత మహాసభ మండల అధ్యక్షుడు కొమనాపల్లి రాము పాల్గొన్నారు.

బొబ్బిలి : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రాం అని ఎస్‌ఐ చదలవాడ సత్యనారాయణ, దళిత ఉద్యోగ సంఘం నాయకులు పి.అప్పయ్య, ఆర్.వరప్రసాద్ అన్నారు. బాబూ జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా శుక్రవారం పార్వతీపురం రోడ్డులో ఉన్న జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు, గిరిజనులు

దుష్ట పాలన అంతమవ్వాలి

టిడిపి నేత కిమిడి కళావెంకటరావు

ప్రజాశక్తి-చీపురుపల్లి

రాష్ట్రంలో జరుగుతున్న దుష్ట పరిపాలనను అంత మొందించాలని చీపురుపల్లి అసెంబ్లీ టిడిపి అభ్యర్థి కిమిడి కళావెంకటరావు అన్నారు. శుక్రవారం స్థానిక రాధామాధవ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.100 కోట్లతో తోటపల్లి కాలువను అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. నియోజకవర్గంలో మూతపడిన పరిశ్రమలన్నింటిని తెరిపిస్తామన్నారు. ఇప్పుడున్న పథకాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. ఒక్క ఛాన్స్అని జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడని అన్నారు. తీరా గెలిచిన తరువాత ఇసుక, సారా వ్యాపారాలలో లక్షలాది రూపాయలను జగన్మోహన్ రెడ్డి దోచుకున్నారని అన్నారు. వచ్చే ఎన్నికలలో టిడిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాలుగు మండలాల టిడిపి నాయకులు, చీపురుపల్లి మండల కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళా వెంకటరావు

బిసిలకు అన్యాయం : శ్రీనివాస్

గజపతినగరం : జగన్మోహన్ రెడ్డి పాలనలో బిసిలకు అన్యాయం చేశారని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ విమర్శించారు. శుక్రవారం మండలంలోని కొత్తశ్రీరంగరాజపురం గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో బిసిలు బిక్కుబిక్కుమంటూ బతికే పరిస్థితి ఏర్పడిందన్నారు. జగన్ పాలనలో సామాజిక న్యాయం కరువైందన్నారు. అనంతరం చెరువు పనుల్లో ఉన్న ఉపాధి కూలీల వద్దకు వెళ్లి రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మర్రాపు సురేష్, మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పివివి గోపాలరాజు, శ్రీరామ్ రెడ్డి రామ్‌కుమార్, ఎడ్ల గోపి, వైకుంఠం ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా : కోండ్రు

రేగిడి : ఎమ్మెల్యేగా గెలిపిస్తే గతం కంటే మెరుగ్గా అభివృద్ధి చేస్తానని టిడిపి రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీ మోహన్ అన్నారు. చిన్న శిర్లాం గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి రూ.10 ఇచ్చి వంద దోచుకొంటున్నారని తెలిపారు. అధిక ధరలు, పన్నులు, ఛార్జీలు, అప్పుల బాదుడుతో ఒక్కో కుటుంబంపై ప్రభుత్వం రూ.8 లక్షల భారం మోపిందన్నారు. సిఎం జగన్ మాటల గారడీలు తప్ప సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. కార్యక్రమంలో కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు, మజ్జి శ్రీను, మంతిన ఉషారాణి, మజ్జి దాలినాయుడు, అప్పలనాయుడు, దుర్గారావు, దూబ అప్పలనాయుడు, పిన్నింటి వెంకటరావు, టంకాల నర్సింగరావు పాల్గొన్నారు.

కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్న కోండ్రు మురళీమోహన్

వైసిపి హయాంలో కానరాని అభివృద్ధి : మాధవి

నెల్లిమర్ల : వైసిపి ఐదేళ్ల పాలనలో ఎక్కడా అభివృద్ధి జాడ కానరాలేదని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి అన్నారు. శుక్రవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని వల్లూరు, బొడ్డపేట, మల్యాడ, వెంకన్న పాలెం, తమ్మాపురం గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బంగార్రాజు, మాధవి మాట్లాడుతూ వైసిపి రాక్షస పాలన అంతమొందించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబుని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సువ్వాడ రవి శేఖర్, మాజీ ఎంపిపి సువ్వాడ వనజాక్షి, గేదెల రాజారావు, పతివాడ తమ్మునాయుడు, కలిదిండి పాణి రాజు, పోతల రాజప్పన్న, నల్లం శ్రీనివాసరావు, కాళ్ళ రాజ శేఖర్, పంచాది జగన్నాథం, లెంక సన్యాసి రావు, గురాన రామారావు పాల్గొన్నారు.

బంగార్రాజుతో కలిసి ప్రచారం చేస్తున్న జనసేన అభ్యర్థి మాధవి

టిడిపిలో చేరికలు

జామి, కొత్తవలస : మండలంలోని కలగాడ గ్రామానికి చెందిన 30 కుటుంబాలు టిడిపిలో చేరాయి. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి నివాసం వద్ద వారంతా ఆ పార్టీలో చేరారు. దొండపర్తి అక్కులు, బోణి సత్తిబాబు, చేవ్వేటి రాధాకృష్ణ, బండారు శ్రీరాములు, దొండపర్తి అప్పారావు తదితరులు చేరగా, వారికి లలితకుమారి టిడిపి కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి వర్రి రమణ, నాయకులు మాకిరెడ్డి శ్రీలక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు. కొత్తవలస మండలం ఎగువఎర్రవానిపాలెం, దిగువఎర్ర వానిపాలెం, చీడివలస, గొల్లలపాలెం గ్రామాలలో ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి ఇంటింటి ప్రచారం చేశారు. టిడిపి నాయకులు, మహిళలు,గ్రామస్థులు ఆమెకు ఘన స్వాగతం పలికారు.

ప్రచారం చేస్తున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి లలితకుమారి

బొబ్బిలి : తెర్లాం మండలానికి సంబంధించి చీకటిపేట ప్రస్తుత వైసిపి సర్పంచ్ మూడడ్ల.పార్వతితో పాటు పలువురు టిడిపి అభ్యర్థి బేబి నాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ఆధ్వర్యాన ఆ పార్టీలో చేరారు. టిడిపిలో చేరిన వారిలో మూడడ్ల కిరణ్, చీకటి గాంధీనాయుడు, చీకటి తిరుపతిరావు, రెడ్డి శంకర్రావు, మూడడ్ల దాలినాయుడు, బంకురు యుగంధర్, ఆగూరు శ్రీను తదితరులు ఉన్నారు.

టిడిపిలో చేరిన చీకటిపేట సర్పంచ్ పార్వతి

టిడిపి నాయకుల మాటలు నమ్మొద్దు

ఎన్నికల ప్రచారంలో వైసిపి ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎన్నికల ముందు ప్రజల వద్దకొచ్చి కల్లబొల్లి కబుర్లు చెప్పే టిడిపి నాయకుల మాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఓటర్లను కోరారు. శుక్రవారం పట్టణంలోని శ్రీనివాసకాలనీలో సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని ఆయన నిర్వహించారు. ముందుగా పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, జిసిసి చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్నికల కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలు పథకాలను నూటికి నూరు శాతం జగనన్న అమలు చేశారని తెలిపారు. టిడిపి హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా దోపిడీ జరిగిందనే.. జగనన్న వాలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి నేరుగా ప్రతి పథకాన్ని లబ్ధిదారుల ఇళ్ల వద్దకే అందించారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మమ్ములూరి వెంకటలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, వైస్ ఎంపిపి పినిశెట్టి రమణ, పుణ్యగిరి దేవస్థానం చైర్మన్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

గడపగడపకూ సంక్షేమ ఫలాలు : బడ్డుకొండ

పూసపాటిరేగ : గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందించింది తమ ప్రభుత్వ మేనని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, వైసిపి జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కొల్లాయివలస, పులిగెడ్డలో వైసిపి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. మన ప్రాంతం అభివృద్ధి కోసం ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు చిన్నయ్య, బుసకల రాజారావు, అమర ఎర్రయ్య, అమర వెంకటయ్య, కేశవరాము, ఆకులు కృష్ణమ్మతో సహా 40 కుటుంబాల వారు వైసిపిలో చేరారు. ప్రచారంలో ఎంపిపి మహంతి కళ్యాణి, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాయణరాజు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, రామతీర్థం ఆలయ బోర్డు సభ్యులు దాడిశెట్టి త్రినాథరావు, నాయకులు మహంతి జనార్దనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, సర్పంచి పైడి సుజాత, నాయకులు తాడిశెట్టి బాబు, మధు, దేశెట్టి గణేష్, పట్టెపు శ్రీనివాసరావు, యడ్ల రామకృష్ణ, రౌతు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

వైసిపిలో చేరికలు

బాడంగి : మండలంలోని కోడూరు, రామచంద్ర పురానికి గ్రామాలకు చెందిన 33 కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పల నాయుడు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌రావు సమక్షంలో శుక్రవారం వారంతా వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఇటీవల టిడిపి నాయకులు బలవంతంగా తమకు కండువాలు వేయించి పార్టీలో చేరారంటూ తప్పుడు ప్రచారాలు చేశారని ఆరోపించడం గమనార్హం. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రామారావు, ఎంపిపి బోగి గౌరి, వైసిపి నాయకులు తెంటు నారాయణరావు, తెంటు మధుసూదన్, మరిపి శంకర్‌రావు, రెడ్డి కృష్ణ, తెంటు సింహాచలం తుదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి

గొంప క్రిష్ణ ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలపాడు, చామలదేవి అగ్రహారం, సంజీవమెట్ట, కడకొండ గ్రామాల్లో యువ నాయకులు, స్వతంత్ర అభ్యర్థి గొంప క్రిష్ణ శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. తన భార్య రమాదేవితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. రెండేళ్ల నుంచి ప్రజా సేవలో ఉంటూ చేసిన కార్యక్రమాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గొంప వెంకటరావు, లగుడు రవికుమార్, గొరపల్లి రాము, గుమ్మడి భారతి, గొరుపోటు వెంకట రమణ, గనివాడ సన్యాసినాయుడు, మాదిబోయిన మంగరాజు, ఆడారి రమేష్, గొర్లి నాగరాజు, సిరికి రమణ, మంచిన అప్పలసూరి, పల్లి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న గొంప క్రిష్ణ దంపతులు

ఎక్కడ చెత్త.. అక్కడే

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో ఏరోజుకారోజు చెత్త తరలించకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తోంది. మున్సిపాలిటీలో ఇంటింటి నుంచి సేకరిస్తున్న చెత్తను డస్ట్ బిన్లలో వేస్తున్నారు. డస్ట్ బిన్లలో వేస్తున్న చెత్తను చిత్తశుద్ధి పార్కుకు తరలించాల్సి ఉన్నప్పటికీ తరలించడం లేదు. దీంతో అమ్మిగారి కోనేరు గట్టు, శ్రీకృష్ణా టాకీస్, గొల్లవీధి, తదితర ప్రాంతాల్లో చెత్త దర్శనమిస్తోంది. ఎక్కడ చెత్త అక్కడే ఉండడంతో దుర్వాసన వెదజల్లుతుంది. చెత్త నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

పోగుపడిన చెత్త

IN THE HONOURABLE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) AT VIZIANAGARAM
I.P.No. 3 / 2024

Between:
Dwarapudi Appala Satyanarayana
S/o. Kittam Naidu, Pothuru Village
Seethampeta, Vepada (M)
Vizianagaram Dist . . . Petitioner
And:
K.Jaggarao & 32 other
. . . Respondents

GENERAL NOTICE

The Public is hereby informed that the above petitioner filed the above I.P. 3/2024 on the file of the senior Civil Judge, Vizianagaram and the matter stands posted to **11-4-2024** for hearing. So public are hereby informed that any objections can be raised in the above case before the Hon'ble Court on **11-04-2024** either in person or through an advocate at 10-30 A.M.

(By Court Order)
G.T.V.MALLESWARA RAO
Advocate
20-1-91/B, 2nd Floor
Near Durgalamma Temple,
Poorna Market Road
Visakhapatnam - 530 001
Cell : 9440110819
Vizianagaram
Dt:05-04-2024

స్వచ్ఛంద రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జరజాపుపేటలో హిందీ మాస్టర్ మంగిపూడి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం శుక్రవారం ఆయన నివాసం వద్ద కుటుంబ సభ్యుల ఆధ్వర్యాన స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. 20 మంది యువత సామాజిక బాధ్యతగా రక్తదానం చేశారు. రక్తదాతలకు కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సరస్వతి, ప్రసన్న, సురేష్, రవికాంత్, డాక్టర్ అవనాపు భానుప్రకాశ్ పాల్గొన్నారు,

మజ్జిగౌరమ్మ ఆలయాన్ని సందర్శించిన కళా

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని బైరిపురం గ్రామంలో మజ్జి గౌరమ్మ ఆలయాన్ని టిడిపి చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు శుక్రవారం సందర్శించారు. మజ్జి గౌరమ్మ కలశ పునః ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా మాజీ సర్పంచ్ కెంగువ ధనంజయ ఆహ్వానం మేరకు కిమిడి కళా వెంకటరావు వచ్చి, పూజలు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీస్ కవాతు

ప్రజాశక్తి-వేపాడ

మండల ంలో వల్లంపూడి, వేపాడ, వీలుపర్తి, వావిలిపాడు, వెల్దాం గ్రామాల్లో సిఐ ఉపేంద్ర ఆధ్వర్యాన కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులతో శుక్రవారం కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు.

రేగిడి : మండలంలోని సంకిలి గ్రామంలో డిఎస్‌పి మహేంద్ర, రాజాం సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యాన సిఆర్‌పిఎఫ్ , ఇతర కేంద్ర బలగాలతో శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామాల్లో ఎన్నికలలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ కవాతు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

వేపాడ.. కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నేరాలు ఘోరాలు

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మతి చెందాడు. మహారాజ్ పేట పున్నమి రెస్టారెంట్ సమీపంలో శ్రీకాకుళం నుండి విశాఖపట్నం వెళ్తున్న రహదారిలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్లంఊట ధ్వంసం

ప్రజాశక్తి-బొబ్బిలి

రామభద్రపురం మండలంలోని కరిందొరవలసలో నాటుసారా తయారీ కేంద్రంపై శుక్రవారం ఎస్ఇబి సిబ్బంది దాడి చేశారు. నాటుసారా తయారీకి సిద్ధం చేసిన 2,200 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు. 10లీటర్ల నాటుసారాను సీజ్ చేసినట్లు ఎస్ఇబి ఇన్స్పెక్టర్ బివి మురళీధర్ చెప్పారు. నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐలు ఎస్వీ రామారావు, ఎల్.తిరుపతిరావు, సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. నాటుసారా తయారు చేసినా, అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఫస్ట్‌ఫ్లోర్, పి.వి.ఎస్. ప్రైమ్, ఎ.జి. రోడ్, 3 లాంతర్ సెంటర్, విజయనగరం.ఫోన్ :80746 56196

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-04-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 184.0 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు #48-8-23/1, Lalitha Plaza, 1st Floor, Near Boy London Shop ,DwarakaNagar, Visakhapatnam, నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
#48-8-23/1, Lalitha Plaza, 1st Floor, Near Boy London Shop, DwarakaNagar, Visakhapatnam, PIN – 530018, CONTACT PERSON AREA MANAGER-NAGESH, CELL NO 89192-39576